క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



వినుకొండ: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నరసరావుపేట కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని పెదకంచర్ల, గోనుగుంట్ల వారిపాలెం, ఏనుగుపాలెం, పిట్టంబండ గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవజ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి, సభ్యులు ఎలిశెట్టి రమేష్, పగడాల రామయ్య, కోవూరి చిన్న వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాలల రణభేరిని జయప్రదం చేయండి



వినుకొండ: మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆధ్వర్యంలో నవంబరు 2వ తేదీన హైదారబాద్‌లో నిర్వహించే మాలల రణభేరి సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మతోటి పాలు కోరారు. వినుకొండలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇటీవల జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, మహానాడు తెలంగాణ అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రణభేరి సభపై చర్చించినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు నిర్వహిస్తున్న ఈ రణభేరి సభలో మాలలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కమలారామ్‌కు సాహితీ కిరీటీ అవార్డు




వినుకొండ: పట్టణానికి చెందిన కవి కమలారామ్‌కు సాహితీ కిరీటీ అవార్డు లభించింది. అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన సాహితీ కిరీటీ పురస్కారానికి కమలారామ్‌ను ఎంపిక చేసి ఆహ్వానం పంపినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 28వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే తెలుగు సాహితీ పట్టాభిషేకం మహోత్సవాల సందర్భంగా జరిగే కార్యక్రమంలో అవార్డు అందజేస్తారని తెలిపారు. అవార్డుకు ఎంపికైన కమలారామ్‌ను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో దేశభక్తి, సేవాభావం



నరసరావుపేట రూరల్: స్కౌట్ అండ్ గైడ్స్‌లో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.పార్వతి తెలిపారు. పాఠశాలలో రెండు రోజుల పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాలకు చెందిన 80మంది స్కౌట్ విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో హెచ్‌ఎం పార్వతి పాల్గొని మాట్లాడారు. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్కౌట్ విద్యార్థులు తమ వంతు సేవలు అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లో సేవాభావాన్ని పెంపొందించేలా స్కౌట్ అండ్ గైడ్స్‌లో చేర్పించాలని సూచించారు. భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మామిళ్ల కృష్ణయ్య, అసిస్టెంట్ లీడర్ ట్రైనర్ బద్దిగం శివనాగిరెడ్డి, స్కౌట్స్ జిల్లా మానవ వనరుల కమిషనర్ పమ్మి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



చిలకలూరిపేటటౌన్: ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని కావూరు గ్రామానికి చెందిన జెర్రిపోతు వెంకటరత్నం ఈనెల 12వ తేదీన తన ఇంటి వద్ద మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. 16 ఏళ్ల కింద భార్య చనిపోవడం, ఆపై దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వెంకటరత్నం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసి కుటుంబ సభ్యులు ముందుగా చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న వెంకటరత్నం(65) శనివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి నలుగురు కుమారులు ఉన్నారు.

టిడ్కో వాసుల ఇక్కట్లు పట్టవా?

- నూతన కలెక్టర్ ఒక్కసారి కాలనీలో పర్యటించి, మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలి
- 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'లో టిడ్కో, జగనన్న కాలనీలను పరిశీలించిన డాక్టర్ గోపిరెడ్డి



టిడ్కో, జగనన్న కాలనీలకు సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టిడ్కో నివాసితులను కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని, వారు పడుతున్న బాధతలను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఒకసారి వచ్చి చూడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేటరోడ్డు రోడ్డులోని టిడ్కో, దానికి ఎదురుగా ఉన్న జగనన్న కాలనీలలో నాయకులు, కార్యకర్తలతో కలిసి సుమారు గంటన్నరసేపు పర్యటించి స్థానికులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ జగనన్న కాలనీలో 600 మంది నివాసం ఉంటున్నా వాళ్లందరికీ కనీస వసతులు తాగడానికి నీళ్లు కూడా లేవని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టించారనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించకుండా పూర్తిగా పూర్తిగా వదిలేసిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు నివాసితులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించకుండా టిడ్కో గృహాలకు కేవలం రంగులు మార్చమంటున్నాడని ఎద్దేవా చేశారు. నివాసితులు చెప్పిన సమస్యలపై డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ చిలకలూరిపేట రోడ్డు నుంచి దాదాపు ఒక కి.మీ పొడవునా టిడ్కో గృహాలకు వచ్చే మెయిన్ రోడ్డు పొడవునా లైట్లు లేక రాత్రిళ్లు రాకపోకలు సాగించేందుకు కాలనీవాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికే నడిచివచ్చే మహిళలు, ద్విచక్రవాహనాలపై ప్రయాణించే ఇద్దరి వద్ద బంగారు గొలుసులు చోరీ చేశారన్నారు. ఉన్న విద్యుత్ పోల్స్‌కి కేవలం లైట్లు వేస్తే సమస్య తీరుతుందని, అయినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు.

- జగనన్న కాలనీలో ఇళ్ల చుట్టూ మోకాళ్ల లోతు నీళ్లతో కాపురాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఓవర్ హెడ్ ట్యాంక్ ఉన్నా టిడ్కో ఇళ్లల్లో ఉన్న వాళ్లకు మాత్రమే రోజుకు ఒకసారి తాగునీరు ఇస్తూ ఎదురుగా ఉన్న జగనన్న కాలనీ వాసులకు ఇవ్వడం లేదన్నారు. దీని వలన వారు రెండు కిలోమీటర్ల దూరంలోని నరసరావుపేట పట్టణానికి వచ్చి తెచ్చుకోవాల్సిన అగత్యం ఏర్పడిందన్నారు.
- విద్యుత్ సరఫరా కోసం 64 ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక సబ్‌స్టేషన్ నిర్మాణం చేయటం జరిగిందన్నారు. పార్క్‌తో సహా ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, ఇప్పుడా పార్కు పిచ్చి మొక్కలు మొలిచి అడవిని తలపిస్తుందన్నారు. బెంచీలు విరిగిపోయాయన్నారు.. టిడ్కో ఎదురుగా రైల్వేట్రాక్ ఉన్నా ప్రహరీతో ప్రొటెక్షన్ లేదని అన్నారు. ఆల్రెడీ ఇద్దరు వ్యక్తులు రైలు ఢీకొని చనిపోయారని, ఒక్క అప్లికేషన్ పెడితే రైల్వేవారే కట్టి పోతారని అన్నారు.



స్థానికులను అడిగి టిడ్కో గృహాల్లోని సమస్యలు తెలుసుకుంటున్న డాక్టర్ గోపిరెడ్డి

కలెక్టర్ గారూ ఒక్కసారి కాలనీని చూడరూ..

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కృతికా శుక్లా ఈ కాలనీ ఒకసారి చూడాలని డాక్టర్ గోపిరెడ్డి కోరారు. జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యలపై స్పందిస్తారని తమకు తెలుసునన్నారు. పార్టీ తరపున ఈ సమస్యలను తీర్చాలని డిమాండ్‌చేస్తున్నామన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షులు అచ్చిశివకోటి, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాష్టారు, సయ్యద్ ఖాదర్‌బాషా, బాదుగున్నల శ్రీనివాసరావు, షేక్ ఫాజుల్లా, సుబ్రమణ్యం నాయీ, మైలేరీ మార్కు, కుక్కల పోలు, తలారి బాలరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- టిడ్కోలో 1530 ఇళ్ల నిర్మాణం జరిగిందని, నివసిస్తున్న వారు 150 కుటుంబాలు మాత్రమే అన్నారు. దాదాపు 1350 మంది నివాసం ఉండట్లేదని అన్నారు. ఎన్నికలకు ముందు తాము రుణం మంజూరుచేసి 650 మందికి తాళాలు అందజేశామని, ఎందుకు ఈ కాలనీని విస్మరించారని ప్రశ్నించారు. డ్రైన్లలో పెరిగిన పిచ్చి మొక్కల వలన నీళ్లు పారట్లేదని, చెత్త తీసుకెళ్లే వారు వారానికి ఒకసారి వస్తున్నారని, మున్సిపాలిటీ అధికారులు ఈ కాలనీతో మాకు సంబంధం లేదు అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

చిలకలూరిపేట: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బకాయిలు రూ. 20వేల కోట్లు విడుదల చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులకు సమయానుకూలంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించటంలోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువు భత్యం, వేతనాలు మంజూరు చేయటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా ఉద్యోగులు, ఉపాధ్యాయులతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఇతర పనులు అప్పగించరాదన్నారు. నారా లోకేష్ మంత్రిగా ఉన్న విద్యాశాఖలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించటంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావుకు పదోన్నతి



నాదెండ్ల: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పనిచేస్తున్న చెరుకూరి శ్రీనివాసరావుకు పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన సత్తెనపల్లి డీఈగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ప్రస్తుతం చిలకలూరిపేట రూరల్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పనిచేస్తున్న సూర్యతేజకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పదోన్నతి పొందిన శ్రీనివాసరావును మండలంలోని పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది అభినందించారు.

రైతులు ఎరువుల వినియోగం తగ్గించాలి

ఈపూరు తహసీల్దార్ నళిని

ఈపూరు(శావల్యాపురం): రైతులు ఎరువులు వినియోగం తగ్గించాలని ఈపూరు మండల తహసీల్దార్ నళిని అన్నారు. ఆదివారం స్థానిక మన గ్రోమార్ సెంటరులో ఎరువులు వినియోగంపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు అధికంగా ఎరువులు వినియోగిస్తే భూమి సారం కోల్పోతుందన్నారు. సాగు చేసే పంటల ఆధారంగా ప్రతి రైతుకు అన్ని రకాల ఎరువులు సకాలంలో సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా రైతులు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులను వినియోగించాలన్నారు. కేవలం రూ.160కే నానో యూరియా ఎకరానికి అర లీటరు పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. అనంతరం మన గ్రోమార్ సెంటరుకు 19.8 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా కాగా, ఒక్కో రైతుకు రెండు సంచులు చొప్పున 220 మంది రైతులకు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, వీఆర్వో అశోక్, గ్రోమార్ మేనేజరు చిన్నబ్బాయి, రైతులు పాల్గొన్నారు.



మన గ్రోమార్ సెంటర్‌లో యూరియా సంచులను పంపిణీ చేస్తున్న అధికారులు

రేపు నాదెండ్లలో మెడికల్ క్యాంపు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గంగా పార్వతీ సమేత మూలస్థానేశ్వర ఆలయం కల్యాణ మండపంలో నరసరావుపేట శ్రీయ హాస్పిటల్స్ అండ్ ఐవీఎఫ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మేనేజర్ రామకృష్ణారెడ్డి, పీఆర్‌ఓ ఖాదర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే క్యాంప్‌లో ఉచిత సంతాన సాఫల్య చికిత్స క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలికంగా సంతానం లేని దంపతులు క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా

శావల్యాపురం: రాష్ట్రస్థాయి అండర్–19 జూనియర్ బాల బాలికల బాల్‌బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నమెంట్ పోటీల్లో శావల్యాపురం హైస్కూలు బాలికలు సత్తా చాటినట్లు పాఠశాల హెచ్‌ఎం బోడ్డపాటి విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 14 వరకు సత్యసాయి జిల్లా రామపురంలో పోటీలు జరగ్గా బాలికల విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు విన్నర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈసందర్భంగా శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆకుమళ్ళ సమీరా, కామినేడి కావ్యలు స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు అందుకున్నారన్నారు. అక్టోబరు నెలలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఇరువురు బాలికలు పాల్గొంటారన్నారు. అభినందించిన వారిలో పాఠశాల ఆంగ్ల బోధకులు బెజవాడ వెంకట నాగేశ్వరరావు, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ వై.శ్రీనివాసరావు, ప్రెసిడెంటు ఇ.శివశంకరు, పీడీలు రాగుల రాధాకృష్ణమూర్తి, బి.ఝాన్సీ, కోచ్ జోనానాయక్, మేనేజరు గోపిలు పాల్గొన్నారు.



ట్రోఫీతో బాలికలు

పొంగిన కొండవాగు



అమీన్‌సాహెబ్‌పాలెం వద్ద చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు


ఎగువ భాగంలో కురుస్తున్న భారీ వర్షాలకు అమీన్‌సాహెబ్‌పాలెం సమీపంలోని కొండవాగు పొంగి రహదారిపై ప్రవహించటంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. చిలకలూరిపేట –నరసరావుపేట రహదారిపై ఉన్న చప్టాపై నుంచి మూడడుగుల ఎత్తు మేర నీరు ప్రవహించింది. ఎస్‌ఐ జి.పుల్లారావు సిబ్బందితో కలిసి ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్‌ను నియంత్రించారు. ద్విచక్రవాహనాలు, ఆటోలను అమీన్‌సాహెబ్ నుంచి బసికాపురం మీదుగా మళ్లించారు. – నాదెండ్ల

22 నుంచి దసరా వేడుకలు



శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీకనక దుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో 24వ దసరా శరన్నవరాత్రి వేడుకలు ఈనెల 22 నుంచి ప్రారంభమై అక్టోబరు 2న ముగుస్తాయని దేవస్థాన కమిటీ ధర్మకర్త రెడ్డి జ్వాలా నరసింహారావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి వేడుకలు ప్రతి ఏటా గ్రామస్తులు, దాతల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. నవరాత్రులు వేడుకలు పురస్కరించుకొని 22న తేదీన మొదట రోజు బాలత్రిపురసుందరిదేవి, 23న శ్రీగాయత్రి దేవి, 24న శ్రీఅన్నపూర్ణ దేవి, 25న కాత్యాయని దేవి, 26న శ్రీమహాలక్ష్మి దేవి, 27న శ్రీలలితా త్రిపురసుందరి దేవి, 28న శ్రీమహాచండీదేవి, 29న శ్రీసరస్వతీ దేవి, 30న శ్రీదుర్గాదేవి, 1న శ్రీమహిషాసురమర్ధని చివరిరోజు 2న శ్రీ రాజరాజేశ్వరి అలంకరణతో భక్తులకు అమ్మవారు దర్శనం ఇస్తుందన్నారు. అమ్మవారి అలంకరణ నిర్వహణ రావిపాటి సాయి భరత్, పూజ కార్యక్రమాలు దసరా వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయాన్నే ఉభయ దాతలచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఉభయ దాతలు వితరణ చేసిన తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు దేవాలయం ప్రాంగణంలో భక్తబృందంచే భజన కార్యక్రమాలు మేళాతాళాల నడుమ వైభవంగా జరుగుతాయన్నారు. అనంతరం మహిళా భక్తులకు దాతలు అందజేసిన ప్రోత్సాహక బహుమతులను లాటరీ విధానం ద్వారా అందజేస్తామన్నారు. దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేస్తామన్నారు. భక్తులందరు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

శాస్త్రీయ, తార్కిక దృక్పథంతో బోధన



వినుకొండ: విద్యార్థి దశ నుంచే చారిత్రిక, భౌగోళిక, పరిపాలన అంశాలు శాస్త్రీయ, తార్కిక పద్ధతుల్లోనే బోధించాలని ఎయిమ్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కె.విజయ్‌కుమార్ సూచించారు. వినుకొండ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ భూగోళం పుట్టుక, చరిత్ర గమనం, మానవుడి పరిణామ క్రమంలో వచ్చిన మార్పులు భావితరాలకు తెలియాలంటే విద్యావ్యవస్థలో మార్పులు అనివార్యమని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు పి.జె.లూకా, మూర్తి, కౌన్సిలర్ షకీలా, విద్యావంతుల వేదిక సభ్యులు విజయ్‌కుమార్, పిడుగు విజయ్, ఎం.ఎ.సాలార్, తెల్లమేకల శ్రీనివాసరావు, బాషా, మస్తాన్‌వలి, వహిదా, రామాచారి, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'



జాలాది గ్రామంలో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న నాయకులు

యడ్లపాడు: కూటమి ప్రభుత్వం పాలనలో కేవలం ప్రచారం మాత్రమే కనిపిస్తోందని, ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్‌సీపీ యడ్లపాడు మండల అధ్యక్షులు వడ్డేపల్లి నరసింహారావు విమర్శించారు. మండలంలోని మూడు గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా మైదవోలు, జాలాది, జగ్గాపురం గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. క్యూఆర్ కోడ్ కలిగిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. తమ మొబైల్స్‌లో క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసుకుని కూటమి మోసాలను, గత ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను స్వయంగా తెలుసుకోవాలని నాయకులు ఆయా గ్రామాల ప్రజలకు వివరించారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఘంటా శంకర్, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రాచమంటి చింతారావు, నాయకులు సర్పంచ్ గౌరు లక్ష్మయ్య, గౌరు హనుమంతరావు, గౌరు రాజేష్, ధర్నాసి రవి, జాలాది నాయకులు ఘంటా రాము, వీరరాఘవయ్య, శ్రీనివాస్, జరుగుల శేషగిరిరావు, మానం శంకరరావు, రాయిపాటి వెంకటరావు, నూజెండ్ల వెంకట్రావు, కుంచపు సాల్మన్‌రాజు, కర్రా అల్ఫోన్, చినకోటయ్య, కొండేటి అంకయ్య, కోటయ్య, దావులూరి మస్తాన్, పుల్లగూర ఆదాం, జోజప్ప, జగ్గాపురంలో వైఎస్సార్ నాయుడు, తెనాలి అంకమ్మరావు, పార్టీ ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి పందుల బుల్లెబ్బాయి, కొండెపాగ రాజేష్, రామదాసు, దావల రమేష్‌బాబు, నూతక్కి రమేష్, కర్నాటి సుబ్బారావు, వలేటి ఉదయ్‌కుమార్, పఠాన్ రెహమాన్, షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు కోరిన విధంగా పరిహారం చెల్లించాలి



సంఘీభావం తెలుపుతున్న లోక్‌సత్తా భానుప్రసాద్

చిలకలూరిపేట: చిన్న, సన్నకారు రైతులు కోరిన విధంగా న్యాయబద్ధమైన పరిహారం చెల్లించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకుడు మాదాసు భాను ప్రసాద్ డిమాండ్ చేశారు. వాడరేవు– పిడుగురాళ్ల రహదారి అభివృద్ధిలో భూములు కోల్పోయిన రైతులు న్యాయమైన పరిహారం చెల్లించాలంటూ బొప్పూడి వద్ద నిరసన దీక్షకు దిగారు. ఆదివారం రైతులకు సంఘీభావంగా పాల్గొన్న భానుప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికైనా జాతీయ రహదారుల సంస్థ నిర్లక్ష్యం వీడి రైతుల న్యాయమైన సమస్యను పరిష్కరించాలన్నారు. అలా చేయనిపక్షంలో శాంతియుత నిరసనను అన్ని రాజకీయ పక్షాలతో కలసి ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

దాసునాయన మఠంలో వేదాంత ప్రవచనాలు

నాదెండ్ల: జాతీయ రహదారి పక్కనే గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ ఆంజనేయస్వామి ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో ఆదివారం మఠాధిపతుల ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమానికి మఠం పీఠాధిపతి కటారు దాసునాయన అధ్యక్షత వహించగా, చుండూరుకు చెందిన తురియానంద, తాడేపల్లికి చెందిన నిరంజన్ దాస్, రాజమండ్రికి చెందిన గీతాస్వామి, సత్తెనపల్లికి చెందిన ఫిరోదుపీఠం వెంకటరావు, తెనాలికి చెందిన చిట్టిబాబు ప్రసంగాలు నిర్వహించారు. ప్రవచనాలు, భగవద్గీత అంతరార్థం, వేదాంత పరిచయం, వేద విజ్ఞానం, ఆత్మజ్ఞానాన్ని పొంది జీవన్ముక్తులగుట అనే అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమాలను నూతలపాటి హనుమాయమ్మ, కటారు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.